రేపు కాంగ్రెస్‌ సమావేశం

కూకట్‌పల్లి: ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు నియోజకవర్గ పరిధిలోని ఏ, బీ బ్లాక్‌ అధ్యక్షులు, డివిజన్‌ అధ్యక్షులు, ఇతర కార్యవర్గ సభ్యుల ఎంపిక కోసం 30న సమావేశం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సాయంత్రం 3 గంటలకు మూసాపేట గూడ్స్‌ షెడ్‌ రోడ్డులోని రాయల్‌ ఫంక్షన్‌ హాల్‌లో జరిగే సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షులు హరివర్ధన్‌ రెడ్డి, నియోజకవర్గ అబ్జర్వర్‌ పారిజాత రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు.

అడిషనల్‌ కలెక్టర్‌కు వినతి

సాక్షి,సిటీబ్యూరో: నిజాంపేట్‌ ,దుండిగల్‌, దమ్మాయిగూడ పురపాలక సంఘాల్లో పని చేస్తున్న మున్సిపల్‌ కార్మికులకు 3 నెలల పెండింగ్‌ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అశోక్‌, చంద్రశేఖర్‌ కోరారు. ఈ మేరకు సోమవారం మేడ్చల్‌ కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్‌ (లోకల్‌ బాడీస్‌) రాధికా గుప్తాకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు ఉన్నికృష్ణ, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

వృద్ధురాలి నేత్రదానం


నాగమణి (ఫైల్‌)

చందానగర్‌: చందానగర్‌ డివిజన్‌ పరిధిలోని రాజేందర్‌రెడ్డి కాలనీ అధ్యక్షుడు కుంట రఘుపతి రెడ్డి తల్లి రాజమణి సోమవారం మృతి చెందింది. ఆమె అవయవాలు దానం చేయాలన్నా ఆమె కోరిక మేరకు నేత్రదాన సంచాలకర్త అల్లం పాండు రంగారవు, పులిపాటి సుధాకర్‌ను సంప్రదించి నగరంలోని ఎల్వీ ప్రసాద్‌ కంటి ఆసుపత్రికి నేత్రాలను దానం చేశారు. ఈ సందర్భంగా వారు రఘుపతి రెడ్డి కుటుంబ సభ్యులు అభినందిస్తూ ఇద్దరి అంధులకు చూపు కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

యువతి అదృశ్యం

గచ్చిబౌలి: యువతి అదృశ్యమైన ఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన యువతి (19) ఖాజాగూడలో ఉంటున్న సోదరి ఇంటికి 10 రోజుల క్రితం వచ్చింది. ఈనెల 26న మధ్యాహ్నం ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో తెలిసిన చోట్ల వెతికినా ఫలితం లేకుండా పోయింది. అటు స్వగ్రామానికి చేరుకోలేదని తెలియడంతో సోమవారం రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జలమండలి కార్యాలయంలో ఆరు ఫిర్యాదులు

చింతల్‌: సురక్షిత నీటి సరఫరాతో పాటు డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని కుత్బుల్లాపూర్‌ జలమండలి జీఎం అశోక్‌ అన్నారు. సోమవారం రంగారెడ్డి నగర్‌ డివిజన్‌ ఏపీహెచ్‌బీ కాలనీలోని జలమండలి కార్యాలయంలో ప్రజావాణి జరిగింది. తాగునీరు సరపడా రావడం లేదని, డ్రైనేజీ పొంగిపొర్లుతోందని, స్టాటిక్‌ ట్యాంక్‌ల ద్వారా నీటి సరఫరాను పునరుద్ధరించాలని ఆరు వినతి పత్రాలు అందాయి. వాటిని స్వీకరించిన అశోక్‌ పరిష్కరించాల్సిందిగా సంబంధిత సెక్షన్ల మేనేజర్లను ఆదేశించారు.

నేడు కాంగ్రెస్‌ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం

కుత్బుల్లాపూర్‌: బహదూర్‌పల్లిలోని మేకల వెంకటేశం ఫంక్షన్‌ హాల్‌లో మంగళవారం కాంగ్రెస్‌ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం ఉంటుందని నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్‌ హన్మంతరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు జరిగే ఈ సమావేశానికి మేడ్చల్‌ జిల్లా కో ఆర్డినేటర్‌ పారిజాత నరసింహారెడ్డి, జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, బ్లాక్‌ల అధ్యక్షులు, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ సెల్‌ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళా నాయకులు పాల్గొనాలని కోరారు.

మున్సిపల్‌ కార్మికుల జీతాలు చెల్లించాలి



నిజాంపేట్‌ : మున్సిపల్‌ కార్మికుల పెండింగ్‌ జీతాలు చెల్లించాలని సీపీఐ, బీజేపీ నాయకులు డిమాండ్‌ చేశారు. సోమవారం మున్సిపల్‌ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెల్లవారుజాము నుంచి విధుల్లో చేరే కార్మికుల పట్ల ప్రభుత్వానికి, అధికారులకు ఇంత చిన్నచూపు ఏంటని ప్రశ్నించారు. వెంటనే కార్మికులకు జీతాలు చెల్లించాలని, లేని పక్షంలో కార్మికుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో బాచుపల్లి మండల అధ్యక్షులు ప్రసాద్‌ రాజు, పార్లమెంట్‌ మీడియా సెల్‌ కన్వీనర్‌ సుమన్‌ రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి దాసి నాగరాజు, కార్యవర్గ సభ్యులు గజెల్లి సంతోష్‌ కుమార్‌, సీపీఐ నాయకులు యేసురత్నం, శ్రీనివాస్‌, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు.. ఎండుతున్న మొక్కలు !

- పల్లె, పట్టణ ప్రకృతి వనాలకు సంరక్షణ కరువు
- లక్షల్లో మొక్కలు నాటుతున్నా పెంచడంలో అశ్రద్ధ
- అటవీ, పంచాయతీ, పురశాఖలు నిర్లక్ష్యం వీడాలంటున్న ప్రజలు

మండుతున్న ఎండల నేపథ్యంలో మొక్కల సంరక్షణపై అటవీ, పంచాయతీ శాఖలు, పురపాలక సంఘాలు ప్రత్యేక చర్యలు తీసుకోకపోవడంతో నాటిన మొక్కలు వాడిపోతున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వనమహోత్సవ లక్ష్యం నీరుగారకముందే.. మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది.



సాక్షి,సిటీబ్యూరో: పంచాయతీలు, పురపాలక సంఘాల్లో ప్రజలు ఎన్నుకున్న పాలకవర్గాలు లేకపోవడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. స్పెషల్‌ ఆఫీసర్లు మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించకపోవడంతో సిబ్బంది వాటి అలనా, పాలనా చూడటంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- మేడ్చల్‌-మల్కాజిగిరి జిల్లాలో హరితహారం, వనమహోత్సవాల్లో భాగంగా ఇప్పటి వరకు రూ.5.50 కోట్ల మొక్కలు నాటారు. అధికారిక లెక్కల్లో జియో ట్యాగింగ్‌ రూపంలో వాటి లెక్కలు కనపడుతున్నాయి తప్పా.. క్షేత్ర స్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. మొక్కలు నాటేటప్పుడు ఉంటున్న పర్యవేక్షణ.. సంరక్షణ చర్యల్లో కనిపించడం లేదు. నర్సరీల నిర్వహణకు రూ. లక్షల్లో వ్యయం చేసి మొక్కలు పెంచి, వాటిని సంరక్షించకుండా వదిలేయడం ద్వారా ప్రజాధనం వృథా అవుతోందనే విమర్శలున్నాయి.

మొక్కల పెంపకానికి....

నర్సరీలో మొక్కల పెంపకానికి కూలీకి రూ. 257లు రోజువారీగా చెల్లిస్తున్నారు. మట్టిని కవర్లలో నింపి విత్తనాలు విత్తేందుకు దాదాపు రూ.1.20 చెల్లిస్తున్నారు. ఒక్కో మొక్క నాటేందుకు, పాదులు తీసేందుకు రూ.37 వరకు చెల్లిస్తున్నారు. రక్షణ కంచెకు రూ.6 వరకు, నీరు పోసేందుకు రూ.3 చెల్లిస్తున్నారు. ఇంత వ్యయం చేసి మొక్కను బతికించుకోకుంటే నిధులు వృథా అవుతున్నాయి. పంచాయతీ, పట్టణాలకు వచ్చే నిధులు, ఇతర గ్రాంట్స్‌ 10 శాతం వరకు హరితహారం, వనమహోత్సవాలకు వెచ్చిస్తున్నారు.

పల్లె, పట్టణ ప్రకృతి వనాల్లోనూ..

- నగర శివారు మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాలు, 34 గ్రామపంచాయతీలు ఉండగా.. వీటి పరిధిలోని 214 ఎకరాల్లో 102 పల్లె, పట్టణ ప్రకృతి వనాలు (పార్కులు) ఏర్పాటు చేశారు. ఉపాధి హామీ పథకం కింద నిధులు వెచ్చించి ఎకరానికి 2,500 మొక్కల చొప్పున నాటడం వల్ల చిన్న వృక్షాలుగా అభివృద్ధి చెందాయి. పల్లెలతో పాటు నగరవాసులకు పల్లె, పట్టణ ప్రకృతి వనాలు (పార్కులు) ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తుండగా, నిర్వహణలో తలెత్తిన నిర్లక్ష్యం వల్ల పచ్చదనాన్ని కోల్పోయే పరిస్థితికి చేరుకున్నాయి.
- శామీర్‌పేట మండలంలో 10 పల్లె ప్రకృతి వనాలు (పార్కులు) ఉండగా.. ఘట్కేసర్‌ మండలంలో 18, కీసర మండలంలో తొమ్మిది, మూడు చింతలపల్లి మండలంలో 13, మేడ్చల్‌ మండలంలో 22 పల్లె ప్రకృతి వనాలు ఉన్నాయి. 13 పురపాలక సంఘాల్లో 21 పట్టణ ప్రకృతి వనాలు ఉన్నాయి. ఈ పార్కుల నిర్వహణ బాధ్యతలను సంబంధిత పురపాలక సంఘాలు, పంచాయతీ, డీఆర్‌డీఏ పర్యవేక్షించాల్సి ఉన్నప్పటికీ, శ్రద్ధను కనబరచడం లేదని స్థానికులు చెబుతున్నారు.
- 5 మండలాల్లోని కాచవానిసింగారం, బొమ్మరాసిపేట్‌, శ్రీరంగవరం, చీర్యాలలో పదెకరాలోపు ఉన్న ప్రభుత్వ భూముల్లో నాటిన సంపద వనాల నిర్వహణలోనూ ఇదే తంతు కొనసాగుతోంది.

పర్యవేక్షణ కొరవడి...

- మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లాలో శాఖల మధ్య కొరవడిన సమన్వయంతో మొక్కలకు నీరందడం లేదు. మూడుచింతలపల్లి, ఉద్దమర్రి, కేశవరం, అలియాబాద్‌, మజీద్‌పూర్‌, ఏదులాబాద్‌, కొర్రెముల, రావల్‌కోల్‌, సోమారం, ఎల్లంపేట, శ్రీరంగవరం, బండమాదారం, తిమ్మాయిపల్లి, కీసర, అంకిరెడ్డిపల్లి, యాద్గార్‌పల్లిల్లో మొక్కలకు నీటి నిర్వహణ లేకపోవడంతో ఎండిపోతున్నాయి.
- 13 పురపాలక సంఘాల్లోని పలు కాలనీల్లో ఇదే పరిస్థితితో మొక్కలు వాడిపోతున్నాయి. జిల్లా అధికార యంత్రాంగంతో సహా డీఆర్‌డీఏ, అటవీ, పంచాయతీశాఖలు, పురపాలక సంఘాలు, స్వచ్ఛంధ సంస్థలు మొక్కల సంరక్షణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

మౌలిక వసతుల కల్పనకు కృషి

- మంచినీటి, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తాం
- అసంపూర్తి పనుల పూర్తికి చర్యలు
- పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ


సమస్య ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పీఏసీ చైర్మన్‌ గాంధీ

ఆల్విన్‌కాలనీ: డివిజన్‌ పరిధిలోని ఆయా కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి పీఏసీ చైర్మన్‌ అరెకపూడి గాంధీ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్‌ పరిధిలోని శంషీగూడ, శిల్పా బృందవనం, మహంకాళినగర్‌, ఛత్రపతి శివాజీనగర్‌ కాలనీల్లో కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలిసి సోమవారం పర్యటించారు. ఆయా కాలనీ వాసులు సమస్యలు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వరద నీటి కాలువ ఔట్‌లెట్‌లో పేరుకుపోయిన చెత్తా చెదారం తీసి, నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడాలని, ఓపెన్‌ నాలాలో, వరద నీటి కాలువలో పూడికతీత పనులు త్వరగా చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. రాబోయే వర్షాకాలం లోగా పనులు పూర్తి చేయాలన్నారు. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు వరద ముంపునకు గురికాకుండా ఇప్పటి నుంచే తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. వరదనీటి కాల్వలో మురుగునీరు కలవకుండా చూడాలన్నారు. ప్రత్యేకంగా మురుగునీటి వ్యవస్థను ఏర్పాటు చేసి అవసరమున్న చోట యూజీడీ పైపులైన్‌ నిర్మాణం చేపట్టాలన్నారు. అదే విధంగా కాలనీలో నెలకొన్న అసంపూర్తిగా మిగిలిన రోడ్ల సమస్యను త్వరగా పరిష్కరిస్తామని, త్వరలో సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. దశల వారీగా రోడ్లను పూర్తి స్థాయిలో నిర్మాణం చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అదే విధంగా మంచినీటి వ్యవస్థను మెరుగుపరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ శ్రావణి, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ రవి, జలమండలి మేనేజర్‌ ఝాన్సీ, నాయకులు, కార్యకర్తలు, కాలనీ అసోసియేషన్‌ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


షటిల్‌ ఆడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్‌

కుత్బుల్లాపూర్‌: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని బీఆర్‌ఎస్‌ పార్టీ విప్‌, ఎమ్మెల్యే వివేకానంద్‌ అన్నారు. సుభాష్‌నగర్‌ డివిజన్‌ ఎస్‌.ఆర్‌. నాయక్‌లో రూ. 2.90 కోట్ల నిధులతో నిర్మించిన ఇండోర్‌ షటిల్‌ కోర్టు క్రీడా ప్రాంగణాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో పిల్లలు ఫోన్లకు పరిమితమై క్రీడలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను షటిల్‌ ఆడేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌ సురేష్‌ రెడ్డి, మేడ్చల్‌ జిల్లా ఫిషరీస్‌ కో ఆపరేటివ్‌ చైర్మన్‌ మన్నె రాజు, డివిజన్‌ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్‌, నాయకులు లక్ష్మీనారాయణ, శేషాచారి, దుర్గారావు, హరిబాబు యాదవ్‌, నర్సింగ్‌రావు, శ్యామ్‌, పద్మ, అనిల్‌, శ్రీదేవి, సరిత, ఎస్‌.ఆర్‌.నాయక్‌ సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్‌, కార్యవర్గ సభ్యులు సదానంద చారి, ప్రభాకర్‌, భాస్కర్‌ రెడ్డి, రమేష్‌ పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ

సాక్షి,సిటీబ్యూరో: జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజా సమస్యలకు సంబంధించిన 68 అర్జీలను జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌ఓ) హరిప్రియ స్వీకరించారు. సోమవారం కలెక్టరేట్‌ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజా వినతులను తీసుకున్నారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ.. ప్రజావాణిలో ప్రజలు అందించే ఫిర్యాదులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, సమస్యలను పరిష్కరించాలని కోరారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలు,బస్తీలు, గ్రామాల నుంచి వచ్చిన పలువురు ప్రజలు పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, తదితర సంక్షేమ పథకాల కోసం ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. అక్రమ భవన నిర్మాణాలు, భూ కబ్జాలు, ప్రైవేట్‌ ఆసుపత్రులు, పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లు తదితర వాటిపై కూడా ప్రజావాణిలో సంబంధిత అధికారులకు స్థానికులు ఫిర్యాదులు అందజేశారు.

పెండింగ్‌ వేతనాలు చెల్లించాలి

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్‌, శామీర్‌పేట్‌ మూడు చింతపల్లి మండలాల్లోని 34 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు బకాయిలు 5 నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్‌ అండ్‌ ఎంప్లాయిస్‌ యూనియన్‌ (సీఐటీయూ) ఉపాధ్యక్షుడు ఎస్‌. శ్రీనివాస్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం మేడ్చల్‌ కలెక్టరేట్‌ ఎదుట గ్రామపంచాయితీ కార్మికులు నిర్వహించిన ధర్నాలో ఆయన మట్లాడారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్‌ఓ హరిప్రియకు అందజేశారు. సీఐటీయూ మేడ్చల్‌ జిల్లా కోశాధికారి ఉన్నికృష్ణన్‌, గ్రామపంచాయతీ కార్మికుల సంఘం నాయకులు సుధాకర్‌, ఆరోగ్యం, ప్రశాంత్‌, శ్రీనివాస్‌, కృష్ణ, రాములమ్మ కార్మికులు పాల్గొన్నారు.

వేతన వెతలు !

- పంచాయతీ కార్మికులకు 5 నెలలుగా రాని జీతాలు
- పురపాలక సంఘాల కార్మికులకు సైతం చెల్లించని వైనం
- అధికారులకు విన్నవించినా.. కానరాని ఫలితం
- శివారులోని కార్మిక కుటుంబాలకు తప్పని తిప్పలు



సాక్షి, సిటీబ్యూరో: పంచాయతీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు 5 నెలలుగా వేతనాలు అందకపోగా.. పురపాలిక సంఘాల్లో పనిచేస్తున్న కార్మికులకు 3 నెలలు వేతనాలు చెల్లించకపోవడంతో వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

పంచాయతీల్లో ఇలా..

నగర శివారు మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్‌, శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల పరిధిలోని 34 గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు 5 నెలలుగా వేతనాలు అందకపోవడంతో వారి కుటుంబాలు అర్ధాకలితో జీవితాన్ని నెట్టుకొస్తున్నాయి. దీంతో కుటుంబపోషణ భారమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇంటి అద్దెలతో సహా నిత్యావసర సరుకులు కూడా కొనలేని పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నూతన పంచాయతీ చట్టం ప్రకారం..

నూతన చట్టం ప్రకారం వీరందరినీ మల్టీపర్పస్‌ వర్కర్స్‌గా పిలుస్తున్నారు. ఈ కార్మికులకు సంబంధించిన వేతనాలు నెలనెలా వారి ఖాతాల్లో జమ చేయాల్సి ఉంటోంది. గ్రామపంచాయతీ ఆర్థిక వనరుల నేపథ్యంలో 5 నెలలుగా వేతనాలు కార్మికుల ఖాతాల్లో జమకాకపోవడం గమనార్హం.

34 గ్రామ పంచాయతీల్లో..

మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లాల్లో 34 గ్రామ పంచాయతీల్లో 600 మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి నెలకు రూ.9.500 చొప్పున రూ.57 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. వీరంతా పారిశుద్ధ్యం, ట్రాక్టర్‌ డ్రైవర్లు, పన్నుల వసూళ్లు, నీటి సరఫరా తదితర విభాగాల్లో పనులు చేస్తున్నారు.

పురపాలక సంఘాల్లోనూ...

మేడ్చల్‌, మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాల పరిధిలో 1746 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేస్తుండగా, వీరికి కూడా అరకొరగా వేతనాలు అందజేస్తున్నారు. ప్రతినెల 10వ తేదీ వరకు వేతనాలు చెల్లించాల్సి ఉన్నప్పటికీ, నెలలు గడిచినా అందజేయకపోవడంతో వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నిత్యవసరాలతో సహా ఇంటి అద్దెలు, తమ పిల్లలను స్కూళ్లలో చేర్పించేందుకు కూడా చేతుల్లో చిల్లిగవ్వలేక నానా ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలోని అతిపెద్ద పురపాలకసంఘం నిజాంపేటతో సహా దుండిగల్‌, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు 3 నెలలుగా వేతనాలు అందకపోవడంతో వారి కుటుంబాలు పస్తులుండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మిగతా 10 పురపాలక సంఘాల్లో కూడా నెలనెలా వేతనాలు రావడం లేదని కార్మికులు ఆవేదన చెందుతున్నారు.

అధికారులు స్పందించాలి..

ప్రజావాణిలో రాత పూర్వకంగా ఫిర్యాదులు చేసినా ఫలితమేమి లేదని, పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని వేతనాలు సకాలంలో అందజేయడం ద్వారా తమ కుటుంబాలకు అండగా నిలవాలని కోరుతున్నారు. జిల్లా అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి, తమ కుటుంబాలను ఆదుకోవాలని కార్మికులు, సిబ్బంది కోరుతున్నారు.

అంబేడ్కర్‌ విగ్రహానికి వినతిపత్రమిచ్చి కాంట్రాక్ట్‌ అధ్యాపకుల నిరసన



అంబేడ్కర్‌ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాంట్రాక్ట్‌ అధ్యాపకులు

కేపీహెచ్‌బీకాలనీ: కాంట్రాక్ట్‌ అధ్యాపకులను రెగ్యులరైజ్‌ జేయాలని పలువురు ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. జేఎన్‌టీయూహెచ్‌లో సోమవారం అంబేడ్కర్‌ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెండు దశాబ్దాలుగా విశ్వవిద్యాలయాల్లో సేవలందిస్తున్న తమకు న్యాయం చేయాలన్నారు. గతంలో మంత్రి శ్రీధర్‌ బాబు, సీతక్క, భట్టి విక్రమార్క మద్దుతు ప్రకటించిన విషయాన్ని వారు గుర్తు చేశారు. ప్రస్తుతం వారు అధికారంలో ఉన్నందున తగిన న్యాయం చేయాలని, ఇచ్చినహామీని నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సురేష్‌నాయక్‌, డాక్టర్‌ శ్రీనివాస్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్‌ సంఘాల ఆధ్వర్యంలో శాంతిర్యాలీ


శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న క్రిస్టియన్లు

కూకట్‌పల్లి: పహల్గాం ఉగ్రదాడి మృతులతో పాటు పాస్టర్‌ ప్రవీణ్‌ పగడాల అకాల మరణానికి సంతాపాన్ని తెలియజేస్తూ సోమవారం కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గాలకు చెందిన క్రిస్టియన్‌ సంఘాల ఆధ్వర్యంలో మియాపూర్‌ క్రాస్‌ రోడ్డు నుంచి కూకట్‌పల్లి మెట్రోగ్రౌండ్‌ వరకు భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి పాస్టర్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ప్రెసిడెంట్‌ రెవరెండ్‌ ఎడ్వర్డ్‌ డబ్ల్యూ రాస్‌, రెవరెండ్‌ పి. యేసుపాదం ఇతర ముఖ్య నాయకులు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శాంతి సందేశాన్ని ఆధునిక సమాజంలో వ్యాప్తి చేయటం, మృతుల కుటుంబాలకు భరోసా కల్పించటంతో పాటు ప్రేమ, ఐక్యత కోసం సమాజంలోని ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో రెవరెండ్‌ కొమ్ము విద్యాసాగర్‌, పాస్టర్‌ మాణిక్యం, తెట్టబావి ఆనంద్‌, మధు, డేవిడ్‌, పీఎల్‌ ప్రసాద్‌, యేసురాజు, బిషప్‌ శామ్‌సన్‌, జాన్‌రిచర్డ్‌, జార్జ్‌, ప్రకాశ్‌, విజయ్‌కుమార్‌, జైపాల్‌, సువార్తమ్మ, డాక్టర్‌ విప్పర్తి పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయం


క్యాండిల్‌ ర్యాలీలో కాంగ్రెస్‌ శ్రేణులు

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: భారత రాజ్యాంగాన్ని పరిరక్షించడమే కాంగ్రెస్‌ ధ్యేయమని ఆ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్‌ అన్నారు. టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి, డివిజన్‌ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్‌యాదవ్‌ ఆధ్వర్యంలో జైబాపూ, జైభీమ్‌, జై సంవిధాన్‌ కార్యక్రమాన్ని ఓల్డ్‌ బోయిన్‌పల్లి డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. వార్డు కార్యాలయం వద్ద బాబు జగ్జీవన్‌ రామ్‌ విగ్రహానికి పూలమాలేశారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్‌ ఇన్‌చార్జి ఉజ్మా షకిరా, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, నాయకులు అమూల్య, బల్వంత్‌రెడ్డి, నల్లోల రాజేందర్‌, విజయకాంత్‌, అరవింద్‌గౌడ్‌, ముస్తఫలి, కనకరాజు యాదవ్‌, శ్రీరాములు, సందిప్‌, అస్లాం, జహంగీర్‌, షాయిన్‌షా, విజయలక్ష్మి పాల్గొన్నారు.

క్యాండిల్‌ ర్యాలీ

ఓల్డ్‌బోయిన్‌పల్లి: పహల్గాం ప్రాంతంలో హిందూ టూరిస్టులను కాల్చి చంపటం దారుణమని కో ఆర్డినేటర్‌ ఇన్‌చార్జి ఉజ్మా షకిరా, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌ అన్నారు. ఆదివారం రాత్రి ఓల్డ్‌ బోయిన్‌పల్లి డివిజన్‌లో క్యాండిల్‌ ర్యాలీ నిర్వాహించారు. హస్మత్‌పేట్‌ చౌరస్తా నుంచి దుబాయిగేట్‌ వరకు ర్యాలీ కొనసాగింది. హిందువులందరూ ఏకదాటిపైకి వచ్చి పాకిస్తాన్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో దండుగుల అమూల్య, బల్వంత్‌రెడ్డి, నల్లోల రాజేందర్‌, విజయకాంత్‌, అరవింద్‌గౌడ్‌, కనకరాజు యాదవ్‌, శ్రీరాములు, సందిప్‌, అస్లాం, జహంగీర్‌, షాయిన్‌షా, విజయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థినికి హోప్‌ ఆఫ్‌ హంగర్‌ సంస్థ చేయూత


చెక్కు అందజేస్తున్న పీఏసీ చైర్మన్‌ గాంధీ, కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌, పీజేఆర్‌ నగర్‌ కాలనీ బ్లాక్‌ నెంబర్‌ 92లో నివాసం ఉంటూ చిరుద్యోగం చేసుకుంటున్న కరుణాకర్‌ కుమార్తె ఉషారాణికి మల్లారెడ్డి కళాశాలలో ఎంబీఏ సీటు వచ్చింది. తల్లిదండ్రులు కాలేజీ బస్సు ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతున్నారని కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన హోప్‌ ఆఫ్‌ హంగర్‌ సంస్థ వారికి సమస్యను వివరించి తగిన సాయం చేయాలని కోరారు. ఆ సంస్థ విద్యార్థిని కాలేజీ బస్సు ఫీజు నిమిత్తం రూ.40 వేలను పీఏసీ చైర్మన్‌ అరెకపూడి గాంధీ, కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ చేతుల మీదుగా సోమవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, వాలి నాగేశ్వరరావు, మోజెస్‌, తిరుపతి, హోప్‌ ఆఫ్‌ హంగర్‌ సంస్థ సభ్యులు వెంకటేశ్వరరావు, రవికిరణ్‌ తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు బాలాజీ టెంపుల్‌కు.. బస్సు సర్వీసు పునరుద్ధరించరూ!

కరోనా సమయంలో నిలిచిన బస్సులు



మూసాపేట: చిలుకూరు బాలాజీ ఆలయానికి నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ప్రతి శని, ఆదివారాల్లో అయితే ప్రయాణికుల సంఖ్య రెట్టింపు అవుతుంది. ఈ ఆలయానికి ఒకప్పుడు కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ నుంచి 288 రూట్‌ నెంబర్‌ గల బస్సు కేపీహెచ్‌బీ కాలనీ టెంపుల్‌ బస్టాప్‌ నుంచి చిలుకూరు బాలాజీ టెంపుల్‌కు బస్సులు నడిచేవి. కానీ ప్రస్తుతం బస్సు సౌకర్యం లేదు. మెహదీపట్నంకు వెళ్లి అక్కడి నుంచి మరో బస్సులో చిలుకూరు బాలాజీ టెంపుల్‌కి వెళ్లాలి. అదే విధంగా సరస్వతి టెంపుల్‌, బోరబండ నుంచి జేపీ దర్గా, కొలన్‌పాక మందిరాలకు ప్రత్యేక బస్సు సౌకర్యం ఉండేది. కరోనా సమయంలో కొన్ని రూట్లు ఆర్టీసీ అధికారులు తగ్గించారు. ఆ తర్వాత కూడా వాటిని మళ్లీ పునరుద్ధరించలేదు. అంతేకాకుండా వివిధ జిల్లాలకు వెళ్లే బస్సు సౌకర్యం ఉన్న సీబీఎస్‌కు రాత్రి 9 గంటల తర్వాత బస్సులు నడిచేవి. వాటిని కూడా తొలగించారు. కరోనా సమయంలో రద్దు చేసిన బస్సు సర్వీస్‌లను పునరుద్ధరించాలని పలువురు వేడుకుంటున్నారు. కనీసం శని, ఆదివారాల్లో అయినా చిలుకూరు బాలాజీ టెంపుల్‌కు బస్సు సౌకర్యం కలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

వినతిపత్రం ఇస్తే పంపిస్తాం

చిలుకూరు బాలాజీ టెంపుల్‌కు కరోనా ముందు బస్సులు నడిచేవి. ఆ తరువాత తొలగించారు. కేవలం మెహదీపట్నం నుంచే బస్సులు నడుస్తున్నాయి. ప్రత్యేక బస్సులు కావాలని స్థానిక ప్రజలు వినతిపత్రం ద్వారా కోరితే బస్సులు నడిపించేందుకు ప్రయత్నిస్తాం.

– హరి, డీఎం, కూకట్‌పల్లి.